చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ అంకిత్‌కుమార్

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అంకిత్‌కుమార్

జనగామ చౌరస్తా, మే 30 : జనగామ మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్ తనిఖీ చేయడానికి ఉపయోగించే రూ.15లక్షల విలువైన డిజీ ట్రాక్ యంత్రాన్ని చోరీ చేసిన నిందితుడిని పట్టుకొని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ అంకిత్‌కుమార్ ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు గురువారం అర్బన్ పీఎస్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అంబేద్కర్‌నగర్ జిల్లా, జహంగీర్ గంజ్ పీఎస్ పరిధిలోని ధన్‌సూర్‌పూర్ గ్రామానికి చెందిన సోనూయాదవ్ (22) బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాడు. ఇంటి దగ్గర ఖాళీగా ఉండడంతో తన సోదరుడు దీపు యాదవ్ బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్‌ను తనిఖీ చేసే భగవతి కన్‌స్ట్రక్షన్ అండ్ సప్లయ్ కంపెనీలో మెషిన్ ఆపరేటర్‌గా జనగామ మండలంలోని యశ్వంతాపూర్‌లో ఉద్యోగంలో చేర్పించాడు. ఇక్కడ సోనూ యాదవ్‌కు వరుసకు సోదరుడయ్యే బాసిష్ట్ యాదవ్ అనే లేబర్ వర్కర్ పరిచయమయ్యాడు. వీరిద్దరూ కలిసి ప్రతిరోజు యశ్వంతాపూర్ వద్ద డిజిట్రాక్ యంత్రం ద్వారా బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైర్లను తనిఖీ పూర్తి చేసిన తర్వాత మద్యం తాగి జల్సా చేసేవారు. వచ్చే జీతం డబ్బులు సరిపడకపోవడంతో రూ.15లక్షల విలువ గల డిజీ ట్రాక్ యంత్రాన్ని గత డిసెంబర్ 8వ తేదీన చోరీ చేసి ఉత్తరప్రదేశ్‌లోని తమ బంధువు అయిన ధారాదేవి ఇంట్లో దాచి పెట్టారు. అనంతరం డిజీ ట్రాక్ యంత్రం చోరీకి గురైందని సోనూయాదవ్ కంపెనీ వారికి చెప్పి సొంతూరుకు వెళ్లాడు. జరిగిన చోరీపై అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఎం భరత్, ఏఎస్సై శ్రీనివాసరాజు, క్రైమ్ కానిస్టేబుళ్లు విశ్వేశ్వర్, వంశీ, కరుణాకర్, రామన్న కలిసి ఉత్తర ప్రదేశ్‌కు వెళ్లి మధ్యవర్తుల ద్వారా కేసు దర్యాప్తు చేయడంతో నిందితుడు సోనూ యాదవ్ తన నేరం అంగీకరించినట్లు ఏసీపీ అంకిత్‌కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత నిందితుడు నుంచి డిజీ ట్రాక్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై భరత్, సిబ్బందిని ఏసీపీ అంకిత్‌కుమార్ అభినందించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- **కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు**
- **ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్**
- **కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**
- **డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్లతో కలిసి విలేకరుల సమావేశం**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్లు, డీసీపీ

జనగామ, మే 30 (నమస్తే తెలంగాణ) : వానకాలం సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినా.. కృత్రిమ కొరత సృష్టించి ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 వానాకాలం వ్యవసాయ సీజన్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. నకిలీ విత్తనాలను కొని రైతులు మోసపోవద్దని, సరైన గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణంలోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలని సూచించారు. వానకాలంలో జిల్లాలో మొత్తం 1లక్షా45వేల ఎకరాలలో పత్తి, 2లక్షల10వేల ఎకరాలలో వరి, 10వేల ఎకరాలలో కంది, 5వేల ఎకరాలలో ఇతర పంటల సాగును రైతులు చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందుకు తగినట్లు 3లక్షల 65 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లకుగాను 1లక్షా79వేల 395 ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు. 63వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం ఉండగా 34వేల క్వింటాళ్లు, 400 క్వింటాళ్ల కంది విత్తనాలు అవసరం ఉండగా, 250 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. 29 వేల 436 మెట్రిక్ టన్నుల ఎరువులు ఫర్టిలైజర్ షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉంచామని కలెక్టర్ వెల్లడించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎవరైనా అలాంటి పనికి పాల్పడితే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 9398616041కు కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో విత్తన ప్యాకెట్ల కృత్రిమ కొరత, లూజ్ సేల్, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తుల అమ్మకాలపై నిఘా పెంచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రోజు వారీ అమ్మకాల నివేదిక సమర్పించడంతోపాటు, రికార్డుల మెయింటనెన్స్ ఉండేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ ఏవో, ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జిల్లాలో వరి, పత్తి, రెడ్‌గ్రామ్ తదితర పంటలు 3.70లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

నకిలీ విత్తన అమ్మకాలు, ఫిర్యాదులు, సాగుపై సలహాలు, సూచనలకు సంబంధించి రైతులకు అధికారులను మరింత చేరువ చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం సహా టోల్‌ఫ్రీ నంబర్ 9398616041 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. అధ రైజ్డ్ ఫర్టిలైజర్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన రకం, లాట్ నంబర్, రసీదుపై డీలర్ సంతకం ఉండేలా చూసుకుని, పంట కోతలు పూర్తయ్యే వరకు దానిని జాగ్రత్తగా ఉంచాలన్నారు. విత్తన రకం కల్తీ, పంటదిగుబడి తగ్గిన సమయంలో విత్తనాలు అసలా, లేక కల్తీవా అని నిర్ధారించుకునే సమయంలో రసీదు తప్పని సరి అవసరపడుతుందన్నారు. జిల్లాలో పూర్తి స్థాయి టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయకున్నప్పటికీ తాత్కాలికంగా తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నకిలీ, లూజు విత్తనాల అమ్మకాలు, ఎక్కడైనా డీలర్లు మోసాలకు పాల్పడినట్లు సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసామని, ఎక్కడ మోసం జరిగినా తన దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు.

జేకేఎస్ అగ్రిమాల్‌లో ఆకస్మిక తనిఖీలు

- **నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించిన కలెక్టర్, డీసీపీ**
- **విత్తనాలు, ఎరువుల అమ్మకాలపై ఆరా**

జనగామ జిల్లా కేంద్రంలోని జేకేఎస్ అగ్రిమాల్‌లో గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, డీసీసీ సీతారాం వేర్వేరుగా ఆకస్మిక తనిఖీలతో హల్‌చల్ చేశారు. విత్తనాల కొరత, బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు, రైతులు ఇష్టపడుతున్న కంపెనీలు విత్తన స్టాక్‌లపై కృత్రిక కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. జిల్లా యంత్రాంగం అతిపెద్ద విత్తన, ఎరువుల దుకాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. తమకు అందిన ఫిర్యాదుల కోణంలో తనిఖీలు, పరిశీలన చేసిన అనంతరం షాపులో ఇప్పటికే కొనుగోలు చేసిన పలువురు రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. విత్తన కొరత, అధిక ధరలు, ఇబ్బందులు వంటి అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్‌కు రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో సంతృప్తి చెందారు. స్టాక్ రిజిస్టర్లలో రోజువారీ విక్రయాలు, విత్తనాల స్టాకు నిల్వలను రిజిస్టర్ల వారీగా పరిశీలించారు. రైతులకు నాణ్యతతో కూడిన విత్తనాలు ఎరువులు సకాలంలో అందించాలని, విక్రయ వివరాలతోపాటు రైతు పేరు, చిరునామా, సెల్ నంబరు వంటి పూర్తి వివరాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట డీఏవో వినోద్‌కుమార్, వ్యవసాయ అధికారులు, డీసీపీ వెంట అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి, ఎస్సై భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

జేకేఎస్ అగ్రిమాల్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్, డీసీపీ

కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు**
- **జిల్లా శిక్షణ తరగతులు ప్రారంభం**

మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

జఫర్‌గఢ్, మే 30 : కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసారావు అన్నారు. జఫర్‌గఢ్‌లో గురువారం సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం కాగా ముఖ్యఅతిథిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామ పక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందని ఆయన అన్నారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే పని చేసిందని, పేదలు, మధ్య తరగతి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలపై బీజేపీ హయాంలో దాడులు పెరిగాయన్నారు. చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేసే ప్రయత్నం బీజేపీ హయాంలో చేశారని శ్రీనివాసరావు అన్నారు. రానున్న రోజుల్లో సీపీఐ బలోపేతానికి పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కృషి చేయాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, మార్క శంకర్‌నారాయణ, పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్దన్, మండల కార్యదర్శి జువారి రమేశ్, పార్టీ నాయకులు కోరారు.

సభ ప్రచార వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనగామ జిల్లా కవులు, కళాకారులు

జూన్ 6న పుస్తకావిష్కరణ సభ

జనగామ చౌరస్తా, మే 30 : కవులు-కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జూన్ 6వ తేదీన జిల్లా కేంద్రంలోని విజయ మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహించే కవి, రచయిత లగిశెట్టి ప్రభాకర్ రచించిన 'రేపటి వెలుగులు', 'నవ్య నానీలు' అనే పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని జిల్లా కవులు, కళాకారులు కోరారు. గురువారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద పుస్తకావిష్కరణ సభ ప్రచారవాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ కవులు తగుళ్ల గోపాల్, జేవీ కుమార్, సుజాత, దాసోజు లలిత, కోడం కుమారస్వామి హాజరవుతారని తెలిపారు. సాహితీ అభిమానులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జీ కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, పొట్టబత్తిని భాస్కర్, వేముల సదానందం, సీహెచ్ సాయికిరణ్, జీ మనోజ్‌కుమార్, కృష్ణ, మురళి, శ్రీనివాస్, సురేశ్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, NEELOFOR, D/o KHAJA AZEEM UDDIN R/o 11-23-1310, L.B. Nagar, Warangal, Warangal Urban-506002, Telangana, India. I have Changed My Name to **NEELOFOR JAHAN** and Solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

యునెస్కో గుర్తింపుపై హర్షం

రఘునాథపల్లి, మే 30 : తెలుగు రాష్ట్రాల్లో గొల్ల, కురుమ సామాజిక వర్గానికి ప్రధాన వస్త్రంగా అనాదిగా వస్తున్న గొంగడికి యునెస్కో గుర్తింపు ఉత్తర్వులు జారీ చేయడంతో రఘునాథపల్లి ఎంపీటీసీ, కురుమ యువజన చైతన్య సమితి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేర్నే ఉషా-రవి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఎంపీటీసీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 47 విశిష్ట చేనేత సంప్రదాయ దుస్తులు గొంగడి ధరించి ఉంటుందని చలికాలంలో వెచ్చగాను, ఎండాకాలంలో చల్లగాను వర్షాకాలంలో మనిషిని తడవకుండా ఉంచడంతో గొంగడికి ప్రత్యేక స్థానాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నారు. భారతదేశంలో గొల్ల కురుమలకు ప్రత్యేక గుర్తింపు రావడం అభినందనీయమని, గొల్ల కుర్మలు ఆర్థిక రాజకీయంగా ఎదిగేందుకు ముందు వరుసలో ఉండాలని ఆమె సూచించారు.

జూన్‌లో పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు

రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు

బచ్చన్నపేట, మే 30 : వచ్చే జూన్‌లో పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు తెలిపారు. గురువారం ఆయన బచ్చన్నపేటలో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇప్పటి వరకు 50వేల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. జూన్‌లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సంఘం సభ్యులు భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

జనగామ చౌరస్తా, మే 30 : జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న మారబోయిన సంయుక్త అనే విద్యార్థిని 2023-24 విద్యాసంవత్సరానికిగాను నిర్వహించిన జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం జీ శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి రూ.12వేల చొప్పున సంయుక్తకు నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుందని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థినికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బచ్చన్నపేటలో..

జనగామ రూరల్ : జాతీయ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు వడ్లకొండ ఉన్నత పాఠశాలకు చెందిన గొల్లపల్లి ఐశ్వర్య, వంగ భవిత ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున నాలుగేళ్ల వరకు ఉపకార వేతనం వస్తుందని హెచ్ఎం స్వర్గం ప్రకాశం తెలిపారు. ఈ పరీక్షకు సిద్ధం చేసిన ఉపాధ్యాయులను ప్రకాశం అభినందించారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : మండల కేంద్రానికి చెందిన దేశబోయిన మానస స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. మానస నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్ఎం సాయం శోభారాణి గురువారం తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఓరుగంటి రమేశ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న బత్తిని వెంకన్న

దేవరుప్పుల, మే 30 : సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను కడవెండిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పంచాయతీ వద్ద సీఐటీయూ మండల అధ్యక్షుడు బస్వ రాంచందర్ నేతృత్వంలో ఈ వేడుకలు జరుగగా జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అయిలయ్య, అంజయ్య, యాదయ్య, దాస్, ఎల్లేశం ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

నర్మెట, మే 30 : మండల కేంద్రంలోని శివశంకర్, సాయిరాం ఫర్టిలైజర్ దుకాణాలను నర్మెట సీఐ సాయిరమణ, ఎస్సై శ్రీకాంత్‌యాదవ్ గురువారం తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, విత్తనాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

జనగామ చౌరస్తా, మే 30 : పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఠాంక్ నారాయణసింగ్ (42) గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా నారాయణసింగ్‌కు మతిస్థిమితం సరిగాలేక పోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, మే 30 : ఈరవెన్ను గ్రామానికి చెందిన దామెర స్వామి ఇటీవల మృతి చెందాడు. స్వామితో కలిసి చదువుకున్న 2005-06 విద్యాసంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. రూ.65వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును గురువారం స్వామి కుటుంబానికి అందజేశారు.

వైభవంగా వేణుగోపాల స్వామి తిరు కల్యాణం

స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

రఘునాథపల్లి, మే 30 : మండలంలోని కోమల్లలో శ్రీ వేణుగోపాలస్వామి-రుక్మిణి సత్యభామ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు అనిల్ బాబు నేతృత్వంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి పట్టు వస్త్రాలు-తలంబ్రాలు సమర్పించి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి-నరేందర్, చింతల నరేందర్ రెడ్డి, గోపాల్‌బాబు, మాజీ సర్పంచులు సుల్తాన్ విజయలక్ష్మి-నర్సింహారెడ్డి, వల్లాల అశోక్, నాయకులు బొల్లపల్లి ఎర్ర కుమార్, పెంట సుమన్, వల్లాల ఉపేందర్, తాటికొండ వెంకటేశ్‌యాదవ్, కన్నారపు రాములు, బొల్లపల్లి సత్తయ్య, బొల్లపల్లి వెంకటస్వామి, పాశికంటి ఉపేందర్, అవధూత శ్రీనివాస్, వేల్పుగొండ నర్సింహులు, చింతల సంపత్‌రెడ్డి, కాంసాని నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న యాకయ్య

పాలకుర్తి, మే 30 : మండలంలోని చెన్నూరు గ్రామంలో జనగామ డీవైఎస్‌వో ఆధ్వర్యంలో ఈనెల 1వతేదీ నుంచి 30 వ తేదీవరకు నిర్వహించిన క్రీడాకారుల శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. క్రీడాకారులకు గ్రామానికి చెందిన మొలుగూరి యాకయ్య క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. యాకయ్య మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం క్రీడాకారులకు ఎంతో దోహద పడుతాయన్నారు. జిల్లా యువజన క్రీడాకారుల అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. సీనియర్ క్రీడాకారులతో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆకారపు ఉపేందర్, బాలబోయిన నరేశ్, మొలుగూరి రవి, జోడు సంతోష్, జోగు వెంకన్న, నారగాని ఎల్లయ్య, మొలుగూరి వెంకన్న, బండారి ప్రశాంత్, పొలాస సోమయ్య, ఎస్‌కే షాదిక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాలకుర్తి, మే 30 : మండల కేంద్రానికి చెందిన 2004-2005 విద్యా సంవత్సరంలోని పదో తరగతికి చెందిన మారోజు శ్వేత తండ్రి దేవేంద్రచారి ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. శ్వేత భర్త జగదీశ్ నెల క్రితం మృతి చెందాడు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శ్వేతతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.40వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును గురువారం ఆమెకు అందజేశారు. అదేవిధంగా మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రాపాక అనిల్‌కుమార్, జీడి నరేందర్, ఈర్ల ప్రకాశ్, గాదెపాక కిరణ్‌కుమార్, ఆంజనేయులు, వడ్లకొండ కుమార్ పాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

హనుమాన్ భక్తుల పూజలు

బచ్చన్నపేట, మే 30 : మండలంలోని కొన్నె గ్రామంలో గురువారం హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృత్యుంజయ యజ్ఞం, హోమం, విఘ్నేశ్వర హోమం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి చందనాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్, స్వామి, శ్రీనివాస్, శంకరయ్య, బాల్‌రాజ్, శివ, మహేందర్, భద్రయ్య, శ్రీకాంత్, అభినయ్, రాజు, సుధాకర్, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జనగామ చౌరస్తా, మే 30 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 690మంది, ఒకేషనల్‌కు 315మంది కలిపి మొత్తం 1005 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఐఈవో) కే ఆంజనేయరాజు తెలిపారు. జనరల్, ఒకేషనల్ కలిపి 65 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు యన తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించిన సెకండ్ ఇయర్ జనరల్ విభాగంలో ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 352మంది, ఒకేషనల్ పరీక్షకు 131మంది కలిపి మొత్తం 483 మంది విద్యార్థులు హాజరయ్యారు. 20 మంది జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు ఆంజనేయరాజు వెల్లడించారు.

బీవోబీ బ్రాంచ్‌ను జఫర్‌గఢ్‌కు మార్చాలి

జోనల్ మేనేజర్‌కు ఎమ్మెల్యే కడియం వినతి

జఫర్‌గఢ్, మే 30 : స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ను జఫర్‌గఢ్‌కు మార్చాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి బ్యాంక్ అధికారులను గురువారం కోరారు. ఈ మేరకు ఆయన గురువారం జోనల్ మేనేజర్ రితీష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ సుమారు 25యేళ్ల క్రితం జఫర్‌గఢ్‌లో నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను అధికారులు స్టేషన్‌ఘన్‌పూర్‌కు మార్చడంతో జఫర్‌గఢ్ మండల పరిధిలోని ఖాతాధారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జఫర్‌గఢ్‌లో బ్రాంచ్ ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, బ్యాంక్‌ను జఫర్‌గఢ్‌కు మార్చాలని జోనల్ అధికారులను శ్రీహరి కోరారు. బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి వార్డును పరిశుభ్